కథ

అవసరాల బానిసలు

— జబీవుల్లా

> రిక్షావాడికి ఆటో ఆశ స్కూటరుంటే కారు ఆశ ఉంటే అందరి ఆశలూ తీరుతాయి లేకుంటే—స్కూటరు రిక్షా అవుతుంది రిక్షా కాలినడక అవుతుంది. అవసరం అన్నిటికీ బానిస అవుతుంది!

"మాసా పండగొస్తుంది. ఈ పండక్కయిన కోకరైక కొనుక్కురా. సంటోడికి సొక్కా నిక్కర అట్లనే నీకోసరం సొక్కా అడ్డపంచె కొనుక్కో. దినం పొద్దుపోయినాంక వస్తావ్. నేను ఎదురు సూసి సూసి కల్లు గుంజుతాయ్. ఇయాల్నుంచి పొద్దాలేరా. ఒక పక్కన నిద్దరొత్తావుంటాది నాకు". అన్న మంగ గారాలుపోతున్న మాటలు రిక్షా లాగుతున్న రాముడి చెవుల్లో గింగురుమంటున్నాయి.

'పండగ వారముందనగానే దానికో కొత్త కోక, రైక, పిల్లోనికి సొక్కా నిక్కర కొనుక్కోవాల. తనదేవుందిలే ఏస్కున్న ఏస్కోకపోయినా పండగైపోతాది. నిరుడు దస్సరకి సేసిన బాకీ తెంచకపోయినందుకు స్వొంతరిచ్చాను గుంజుకున్నాడు సేటు. ఇప్పుడు బాడిగె రిచ్చాను తొక్కే బతుకైపోయినాది. పోన్లే సమచ్చరానికి ఒకపారి సేసుకునే దస్సర పండక్కి గుడ్డలు లేకపోతే దానెవ్వ! మంగ ముందర మొహం వుండదు. చున్నం కొట్టి యర్ర మన్నులో ఇల్లలుక్కుంటే పండగెట్టా అవుతాది. ఇంటిది సోకుసింగారం సేసుకుంటేనే పండగ. ఇట్లాంటి ఇసయం తేల్సాలంటే మున్నారు జల్ కొందే గుడ్డ్రాలవు.

అతని కాళ్ళు పెడల్స్‌ను తొక్కుతున్నాయి. కాని రిక్షా మాత్రం ముందుకు సాగిపోవడంలేదు. రిక్షా తొక్కి తొక్కి చెమటలు పట్టాయి. నీరసంతో రొప్పుతున్నాడు.

"థూ... చెయి,పడిపోయినాది. బాడిగె రిచ్చాలింతే బాబు" అని రిక్షాలో కూర్చున్న సుబ్బారావుతో చెప్పి రిక్షా చెయిన్ ఎక్కించాడు. చేతికి అంటుకున్న కందెనను తన సీటు క్రింద వుంచిన తుండు గుడ్డతో తుడుచుకొన్నాక రిక్షా తొక్కడం మొదలుపెట్టాడు.

"బతుకంతా రెక్కాముక్కా చెమట లైపారినా బాడిగెపోను పాతిక రూపాయలు మిగులుతాయి. అయికూడ ఏటికి సరిపోతాయ్. గతకడానికే సాలకొస్తయ్. ముందులక్కా రిచ్చాలకి ఇలువలేదు. ఆటోలు వచ్చినాయ్.

"ఠంగ్...

"బెల్లుపడిపోయిందిరోయ్" వెనుకనుంచి. ఎకస్సక్కెంగా సొంత రిక్షావాడి అరుపు

"ఒరే... బెల్లుకూడా యిట్లా సచ్చినానది. మంది సొమ్ము తినే వనర్లు రిచ్చాల బాడిగె తింటారు. ఒకటిగాని సరింగవుండవ్ సారు" అన్నాడు ప్యాసింజరు సుబ్బారావుతో.

"ఏం రాయుడు! ఈ వేళ చిర్రుబుర్రులాడుతున్నావ్ ఇంట్లో కొట్లాడినావా?–" రోజు తన రిక్షాలో కూర్చునే సుబ్బారావు అడిగాడు.

"అట్లాగేమి పోర్లేదు బాబు. దస్సర పండక్కి కొత్త గుడ్డలు కొనాల. మా యింటిది పండగ వారంనాడుందనంగానే గ్యాపకం సేసినాది. పోయిన సమచ్చరం బాకీ తెంచకపోయినందుకు సీటు రిచ్చా గుంజుకున్నాడు. ఆణ్నుంచీ ఈ బాడిగె బండి తొక్కుతున్నానయ్యా"

రాముడు మాటలు ఆపి అటునుంచి రివ్వున దూసుకువచ్చిన ఆటోను చూసి అన్నాడు.

"ఈ యాటోలు గనక ల్యాకపోతే రిచ్చాలకి శానా గిరాకీ వుంటాది బాబు"

పాడు రిక్షా వదిలేసి ఆటో నేర్చుకుని బాడుగకు తీసుకోవచ్చుగదా"

"భల్లే సెప్పినారుసారు. అట్ల నాకు తెల్చిన ఇసయమే. యాటో నేర్చుకోవాలంటూరా! నేర్చుకొని యాటో బాడిగకు తీసుకోవాలి. అంతవరకు కూడెవడు పెడ్తాడు. బాబు. రాల్‌లో ల్యాకపోతే గమ్మనుండాలగాని బడాయికి పోరాదు". అన్నాడు గంభీరంగా.

"ఈ యాటోవాళ్లు అయిదార్రూపాయలకే ఎక్కిస్కుంటారు. ప్యాసింజర్లు యాటోలకే అల్వాట సేసేస్కున్నారు. రిచ్చాలోల్లకి యిచ్చే బాడిగే కంటే తక్కువ బాడిగెతో తుర్రుమని పోతారు. పోన్లెండి రిచ్చాలో ఎక్కేమన్సులు ల్యాకబాబు. సొంత రిచ్చా వుండాలి. నా సామిరంగా. సిటికెలో ఏలు సంపాయిల్తా ఏలు. పండక్కి గుడ్డలు ల్యాకపోతే మనే. మాయింటి దాన్కి నచ్చెప్పి లెక్క ఎత్తిపెట్ట కొత్త రిచ్చా కొంటాను బాబు"

రిక్షా తొక్కుతున్నరాముడు మాటలు ఆపి అటూ ఇటూ చూసి అన్నాడు.

"ఈ దావనపోతే బెరీన్ ఆఫీసు సేర్తాంగాని రోడ్డు పాడుతా గుంతలు పడ్డాయ్. ఒకసారి పోయినాంక మోకాల్లయవ్‌లు యిరుకుపడ్డాయ్ బాబు"

"ఎలచ్చన్లు ఎన్నడొస్తున్నాయ్. సారు. నిరుడు ఎలచ్చన్లప్పుడు రోడ్లు బాగా సేస్తామని బీదోల్లకి సాయం సేస్తామని— నాలోంటోల్లకి రిచ్చాలిప్పిస్తామని శానాశానా పెమానాలు సేసినారు. ఆయింత ఎలచ్చన్లు అయినావ్ ఒకడు కానొస్తే ఒట్టు"

మాటల మధ్యలో రిక్షా ఆఫీసు చేరుకుంది. రాముడు సుబ్బారావుని దిగబెట్టి వెళ్ళిపోయాడు.

సుబ్బారావు పన్జేసేది ఋణాలిచ్చే బ్యాంకు అనుబంధ సంస్థ. ఆ ఆఫీసులో హైర్ పర్చేజ్ క్రింద టి.వి.లు, వెహికల్స్. ఫ్రిజ్‌లు యిస్తుంటారు. సుబ్బారావు మెదడులో మెరుపులాంటి ఆలోచన తళుక్కుమంది. తన మంకుపట్టుతో తానుండే ఆఫీసులో వెహికల్స్ క్రింద రాముడికి రిక్షా యిప్పించాలని నిర్ణయించుకున్నాడు. అనుకోవడం ఎంత ఆలస్యమో అంత త్వరలో ఇప్పించడానికి ఉద్యుక్తుడయ్యాడు. మరుసటి రోజు రాముడితో చెబుతూ తీసుకెళతాడు. ఇంకేముందీ! రిక్షా ఆఫీసు చేరేసరికి మేనేజర్ని చూసి గట్టిగా ఊపిరి పీల్చుకొంటాడు సబ్బారావు.

సుబ్బారావు ఆలస్యంగా వచ్చినందుకు మేనేజరు కస్సుబుస్సులూ. ఇదే వేళ వరుసలలో రేపు కలుద్దామన్నట్లు రాముడు. "ఎక్స్ప్లైన్ సార్" అని మేనేజర్ పోయి తగలడు" అని చివాట్లేయడం. సుబ్బారావు రోజూ ఆ విషయం భార్యామణికి జ్ఞప్తికి తెస్తూనే వుంటాడు. కింకర్తవ్యం ఆచరణలో శూన్యమైంది. తొందరగా నిద్రలేచి పనులు చక్కదిద్దుకొని ఆఫీసు చేరుకునే సమయం యధావిధి పదిన్నర.

సుబ్బారావు మేనేజరు చివాట్లు పడలేక బాధపడుతూ ఆలోచిస్తున్నాడు. అతని ఒక అప్లికేషన్ పెట్టించాడు. వారం తిరక్కముందే రాముడి చేతుల్లో క్రొత్త రిక్షా. ముఖంలో క్రొత్తగా సంతరించుకొన్న ఆనందం. దసరా ప ండుగకి ఇంటిల్లిపాదికి క్రొత్త గుడ్డలు కొనివ్వాలనే ఆలోచన రూపం దాల్చింది. రేయింబవళ్ళు రిక్షా తొక్కుతూ మూడొందలు జమచేసుకొని పండక్కి బట్టలు తెచ్చాడు. పండగ ఆనందోత్సాహంతో చేసేశాడు రాముడు.

సుబ్బారావు ఆఫీసులో అడుగుపెట్టే సరికి సమయం సరిగ్గా పదిన్నర అయింది. రోజు ఖచ్చితంగా పది గంటలనుకొని గట్టిగా నిర్ణయించుకొన్నా. తన ప్రయత్న విఫలం అరగంట ఆలస్యం కానిచ్చేది. రాత్రంతా శ్రీమతి సంసార భాగోతం. అప్పుసొప్పులు, తీర్చలేని కోరికలూ... ఉదయం నిద్రలేచేసరికి ఎనిమిది. కాలకృత్యాలు గట్రా. టిఫిన్లు పూర్తయ్యేసరికి పది. రాముడి రిక్షా బెల్లు మ్రోతకు కంగారుగా వచ్చి రిక్షాలో కూర్చుంటాడు. రాముడు అట్టడుగుల బతుకుల కథలు భార్య ముందు తన బాధనంతా వెళ్ళగక్కేవాడు. ఆమె మెదడులో ఆలోచన స్ఫురించింది. అదేమిటంటే తాను ఉద్యోగం చేసేచోటు వెహికల్స్‌కు లోన్ యిస్తారు. దాంతో లూనా కొనమని సలహా. సలహా యివ్వడమే కాదు. లూనా కొంటే సమయమెంత ఆదా చేయవచ్చు. సరిగ్గా ఆఫీసుకు వెళ్ళవచ్చు. సాయంకాలం తామిరువురు భార్యాభర్తలు అలా షికారుకు వెళ్ళి రావచ్చని చెప్పింది. చెప్పిందనడం కంటే బలవంత పెట్టిందనడం సమంజసమేమో! మధ్యతరగతి కుటుంబంలో తనకొచ్చే జీతం నెలలో ఇరవై రోజులకే ఖర్చయిపోతాయి. మిగతా పది రోజులు రిక్తహస్తాలతో జీతం కోసం ఎదురుచూడ్డం జీవితం రొటీన్ అయిపోయింది. ఇప్పుడు క్రొత్తగా లూనా అప్పుతీర్చడం గగనకుసుమమే.

స్వర్గానికైనా—నరకానికైనా—స్త్రీయే కారణమైనట్టూ భార్య మొర విని బుద్ధిగా లూనా తెచ్చుకొంటే సమయానికి ఆఫీసుకెళ్ళి మేనేజరు మన్ననలు పొందవచ్చని గట్టి నిర్ణయంతో లూనా కోసం అప్లికేషన్ పెట్టాడు. అప్లికేషన్ చూసిన మేనేజరు ఏ వంకలు పెట్టకుండా లోన్ శాంక్షన్ చేసేశాడు. నెల రోజుల్లో లూనా చేతికి వచ్చేసింది.

లూనా కొన్న దగ్గర్నుంచీ రిక్షాతో పన్లేదని రాముడు రిక్షా తీసుకురావడం మానేశాడు. ఒక రోజు రిక్షాలో వెళ్ళవలసి వచ్చింది సుబ్బారావుకి.

రాముడు కోసం చుట్టూరా కలయజూశాడు. రాముడు రిక్షాలో కూర్చొని బీడి దమ్ములాగుతున్నాడు. సుబ్బారావును చూస్తూనే భయంతో బీడి పడేశాడతడు.

"యాడికి పోవాలబాబు ఆఫీసుకా?"

"అవునుపద" అన్నాడు.

అతడు కూర్చున్నాక ఆశ్చర్యమనిపించింది సుబ్బారావుకు.

"రాముడూ! క్రొత్తరిక్షా ఏంటిలా పాతదైపోయింది." అడిగాడు. అనుమానంగా.

"సెప్మంటారాబాబు. మా యింటిది పాలుమాలిన్దయ్యా. అది యాదో జరగడంతో ఇంగిలీసులో హం... మతికి లేదండి". కొంచెం సీసాలోబించి.

"హా...మతికి వచ్చినాది. టైపాయిడ్ జరమంట. దాని రోగానికి మందులకి డాక్టర్‌కి లెక్కకావద్దు. బొంగారంలక్క రిచ్చాని అమ్ముకొన్నాను బాబు. ఇది బాడిగె బండి.

"ఏంది బాబు శానా విశారంగా వుండారు. ఇయాల లూనా బండిల్యా లేదు" అడిగాడు

"కొంచెం రిపేరుంటే తీసుకురాలేదు"

రిక్షా అమ్మివేసిన అపరాధంగా రాముడు ఎక్కువగా మాట్లడలేదు. లూనాకు అలవాటుపడి రిక్షాలో వెళుతున్నందుకు ఫీల్ అవుతూ సుబ్బారావు మాట్లాడలేదు.

ఆఫీసులో కాలు మోపుతూనే పదిన్నర. మామూలే. మేనేజర్ క్యాబిన్‌లో ప్రవేశించాడు. ట్రింగ్... ట్రింగ్ మని ఫోన్ రింగయింది. ఫోన్ అందుకున్నాడు మేనేజర్. అది అతని భార్య దగ్గర్నుంచీ. ఫోన్‌లో భార్యను శాంతపరుస్తున్నాడు.

"ఓకే డాళింగ్... ఆమాత్రానికే నా మీద అలకనా?రేపు నెల మారుతి కారొచ్చేస్తుంది. ఆ మాత్రం నీ కోరికనెలా తీర్చలేకపోతానా ? ప్రస్తుతానికి నా వెహికల్‌తో సరిపెట్టుకో" అంటూ రిసీవర్ని క్రెడిల్లో వుంచబోయి. మారుతికారు డీలరుకు ఫోన్ చేశాడు.

"ఏవయ్యా! ఆర్డరిచ్చి పది రోజులవుతుంది. బ్లాకులో ఎంతైనా సరే. తొందరగా కావాలి" ఫోన్లో హడలెత్తించాడు.

సుబ్బారావు ఆలస్యంగా వచ్చినందుకు కోపించలేదు. పైగా చిర్నవ్వుతో అన్నాడు

"నా మిసెస్‌కి మారుతి కారు కావాలట. పట్టుబట్టి తన పంతం నెగ్గించుకుంది. తన పంతం నెగ్గించుకోవాలని సత్యభామ పారిజాతం కావాలని కోరడం కృష్ణుణ్ణి ఎడబాటులో ముంచెత్తింది.

సుబ్బారావు నెల జీతం సరిదిద్దలేక మరిన్ని అప్పులు చేసి లూనా అమ్మేశాడు. యథాప్రకారం రాముడి రిక్షాలోనే ఆఫీసు కెళ్ళేవాడు.

ఇంతే! అట్టడాకు చివికిపోయిన జీవితాలు బ్రతుకు భారాన్ని మోయలేక పాలుమాలిన భార్యన నయం చేయించడానికి మందుల ఖర్చులకు బంగారంలాంటి క్రొత్తరిక్షాను అమ్ముకొన్నాడు.

జీవితాంతం గుమాస్తాగిరి వెలగబెట్టే సుబ్బారావు. మధ్య తరగతి బ్రతుకుల్లో కడతీర్చని అప్పుల బాధను భరించలేక వాయిదాల పద్ధతి మీద తీసుకున్న లూనా అమ్ముకున్నాడు.

తనకన్నా పై తరగతిలో వున్న మేనేజర్ భార్య మారుతి కారుని కోరుకొన్న వెంటనే కొనగలిగాడు. జీవితం కొందరికి వడ్డించిన విస్తరి అయినపుడు అన్ని సౌకర్యాలూ, సదుపాయాలు సమకూరుతాయి. వచ్చిన వస్తువు వెంట ఇంకొకటి జత అవుతూవుంటాయి.

రాముడు భార్య మంగ జ్వరం నుండి కోలుకోడానికి మందులకు రిక్షా అమ్ముకొన్నట్లు

సుబ్బారావు నిత్యజీవితంలో అప్పుల ఊబిలో కూరుకుపోయి లూనా అమ్ముకొన్నట్లు

మేనేజర్ మారుతికారుని అమ్మలేదు ఎందుకంటే నిత్యావసరాలకు అతను బానిస కాడు. నిత్యావసరాలే అతని బానిసలు.